# లక్ష ఓట్ల మెజారిటీ సాధనే లక్ష్యం

● బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ముఠా గోపాల్

ముషీరాబాద్, నవంబర్ 3: ముషీరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ముఠా గోపాల్ ప్రచార పర్వాన్ని ముమ్మరం చేశారు. లక్ష ఓట్ల మెజారిటీ సాధించడమే లక్ష్యంగా ప్రచారాన్ని సాగిస్తున్న ఆయన చేసిన అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజల్లోకి తీసుకువెళ్తున్నారు. గత ఐదేళ్లుగా ప్రజల్లో నిత్యం ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన తీరును జనం లోకి తీసుకువెళ్తున్నారు. గత శాసన సభ ఎన్నికల్లో 35 వేల మెజారిటీతో విజయ ఢంకా మోగించిన గోపాల్ ఈ సారి లక్ష ఓట్ల మెజారిటీ సాధించాలనే లక్ష్యంతో ప్రచార పర్వాన్ని కొనసాగిస్తున్నారు. గత ఐదేళ్లలో తాను వెయ్యి కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, లక్షా పది వేల మంది సంక్షేమ పథకాలు, ఆసరా పెన్షన్లు అందించిన తీరును జనంలోకి తీసుకువెళ్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి మీ ఇంటిలో ఎవరికైనా పెన్షన్లు వస్తున్నాయా, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు అందాయా అని ఆరాతీస్తూ ఓట్లు వేసి గెలిపించాలని కోరుతున్నారు.



ముషీరాబాద్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ముఠా గోపాల్



గ్యాస్ సిలిండర్‌తో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

**మ్యానిఫెస్టో విస్తృత ప్రచారం..**

ఇటీవల సీఎం కేసీఆర్ విడుదల చేసిన బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలను ఓటర్లకు అందజేస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే పథకాలను వివరిస్తున్నారు. 400 వందలకే గ్యాస్, తెల్ల రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం, మహిళలకు మూడు వేల ఆర్థిక సహాయం వంటి అంశాలను ముమ్మరంగా ప్రచారం చేస్తూ ఓట్లు అడుగుతున్నారు. ముఠా గోపాల్ ఎన్నికల ప్రచారంలో ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుంది.

**ప్రచార అస్త్రంగా అభివృద్ధి పనులు..**

బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. పలు పెండింగ్ సమస్యలతో పాటు కొత్తగా పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గురుకుల బీసీ, ఎస్సీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు, వీఎస్‌టీ కూడలి విస్తరణ, ప్రతిష్టాత్మకంగా స్టీలు వంతెన నిర్మాణం, ఆర్టీసీ క్రాస్ రోడ్డు ఇందిరా పార్కు మార్గంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం వంటి అభివృద్ధి పనులు ప్రచార అస్త్రాలుగా ముందుకు వెళ్తుంది. అంతేకాదు పలు చౌరస్తాలలో సిగ్నల్స్ తొలగించి యూ టర్న్‌లు ఏర్పాటు చేయడం, అంజయ్యనగర్, సాయిచరణ్ కాలనీ, లంబాడితండా, భోలక్‌పూర్‌లలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణం, నాగమయ్యకుంట ప్రధాన నాలాకు రిటర్నింగ్‌వాల్ నిర్మాణం, బీమా మైదానం, దామోదరం సంజీవయ్యనగర్, అడిక్‌మెట్‌లలో కమ్యూనిటీహాళ్ల నిర్మాణం వంటి పనులను ప్రచారం చేస్తూ ముందుకు వెళ్తున్నారు.

## అలరించిన తెలంగాణ సంగీత హారతి



సినీ గీతాలు ఆలపిస్తున్న నటుడు సాయికిరణ్

ముషీరాబాద్ నవంబర్ 3: మనీషా కల్చరల్ ఆర్గనైజేషన్ నిర్వహణలో, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శుక్రవారం తెలంగాణ సంగీత హారతి పేరిట దుబాయ్‌లో నిర్వహించిన సంగీత విభావరి విశేషంగా అలరించింది. గాయనీగాయకులు దివ్యకాంతి, శ్వేత, ప్రశాంతి, ప్రగతి తదితరులు సినీ నటుడు సాయికిరణ్‌తో కలిసి తెలుగు, హిందీ సినీగీతాలాపనలతో అలరించారు. అనంతరం పలువురు ప్రముఖులకు మనీషా పురస్కారాలను అందజేసినట్లు సంస్థ నిర్వాహకుడు బాపు శాస్త్రీ తెలిపారు. డాక్టర్ టీఆర్‌కె రావు, టి.రామకుమార్, వీరభద్ర, ఆర్‌సీఎం రాజు, వెంకటేశ్‌గుప్త, శ్రీనివాస్, శశిధర్, మల్లేశ్ పాల్గొన్నారు.

## రౌద్రం పుస్తకావిష్కరణ..



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య

ముషీరాబాద్, నవంబర్ 3: విద్యానగర్ వివేకానంద డిగ్రీ కళాలలో శుక్రవారం ప్రభుత్వ పాలనా శాస్త్ర అధ్యాపకుడు తిరుపతి రాసిన కవితా సంపుటి రౌద్రం పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య ముఖ్య అతిథిగా పాల్గొని రౌద్రం కవితా సంపుటిని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గొప్ప కవితా రచనల ద్వారా కవి తిరుపతి సామాజిక వెనకబాటుతనాన్ని కళ్లకట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ జె. చిన్నబాబు, డాక్టర్ ఆంజనేయులు, ఎస్ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవి ఏకు తిరుపతిని ప్రిన్సిపాల్ సుకన్య, అధ్యాపకులు సత్కరించారు.

## ధ్రువపత్రాలు లేకుంటే కేసులు నమోదు చేస్తాం



వాహనాలను తనిఖీ చేస్తున్న చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, సీఐ జహంగీర్‌యాదవ్

కవాడిగూడ, నవంబర్ 3: ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనదారులు సరైన ధ్రువపత్రాలను చూపకుంటే నగదు, బంగారం సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని చిక్కడపల్లి ఏసీపీ ఎ. యాదగిరి హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ముషీరాబాద్ చౌరస్తాలో ముషీరాబాద్ సీఐ జహంగీర్ యాదవ్‌తో కలిసి ఏసీపీ యాదగి రి వాహనాలను తనిఖీ చేశారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి రోజు వాహనాల తనిఖీ చేస్తున్నామని అన్నారు. ఎన్నికలు సజావుగా సాగే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ పోలీసులు మిలటరీ బలగాలు పాల్గొన్నారు.

## 5న దళిత ఐక్యవేదిక దసరా మిలాప్

ముషీరాబాద్, నవంబర్ 3: తెలంగాణ దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల ఐదవ తేదిన దసరా మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఐక్యవేదిక ప్రతినిధులు గజ్జెల సూర్యనారాయణ, రూపాల వివేకానంద, గడ్డం నవీన్, తిరుమల్‌రావు, ఎం.భాస్కర్, ఎర్రం శేఖర్ తెలిపారు. శుక్రవారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంతో వారు మాట్లాడుతూ ప్రతియేటా దళిత వర్గాల ఐక్యత సాధించే దిశగా దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో దసరా మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం ఉదయం పది గంటల నుంచి బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దసరా మిలాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు, మేధావులు, యువతి, కువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వైదిక ప్రతినిధులు హరీశ్, బి.రమేశ్, కె.మధు, ఈ సత్యనారాయణ, కేశపురం అరుణ్ పాల్గొన్నారు.

## ఐదేండ్లలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశాం



బడీ మసీద్ వద్ద ముస్లింలను ఆలింగనం చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ

కవాడిగూడ, నవంబర్ 3: గత ఐదేండ్లలో ముషీరాబాద్‌లో ఎంతో అభివృద్ధి చేశామని, రాబోయే ఎన్నికల్లో రెండవసారి ముఠా గోపాల్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం భోలక్‌పూర్‌లోని బడీ మజీద్ వద్ద డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ప్రార్థనలు ముగించుకొని ముస్లింలను కలిసి బీఆర్ఎస్‌కు ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో మతఘర్షణలు లేవని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు కలిసి మెలిసి జీవించేలా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. ఎ ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనారిటీ కమిటీ రాష్ట్ర నాయకులు షరీఫొద్దీన్, రహీం, జునేద్ బాగ్దాది, అతిక్ ఉర్ రహమాన్, అగ్బర్, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'మాదిగ ఉప కులాల విశ్వరూప సభ'ను విజవంతం చేయాలి



ఇందిరానగర్‌లో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎంఎస్ఎఫ్ నాయకులు గజ్జల రాజశేఖర్ మాదిగ

కవాడిగూడ, నవంబర్ 3: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు తక్షణం చట్టబద్ధత కల్పించాలని ఈ నెల 11న సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించతల పెట్టిన 'మాదిగ ఉప కులాల విశ్వరూప సభ' ను విజవంతం చేయాలని ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజక వర్గం ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం భోలక్‌పూర్‌లోని ఇందిరానగర్‌లో ఎంఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు అమ్ముగూడెం దశరథ్ మాదిగ ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత సాధించుకునే ఆశయ సాధనలో అంతిమ యుద్ధానికి మాదిగలంతా సిద్ధం కావాలని అన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ నేతృత్వంలో పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 11న తలపెట్టె సభకు మాదిగలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ సీనియర్ నాయకుడు రాహుల్ మాదిగ, శ్రీహరి మాదిగ, నరేందర్ మాదిగ, మైనారిటీ విభాగం నాయకులు మహ్మద్ ఇస్మాయిల్, మహ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీనగర్‌లో కార్యకర్తల ప్రచారం..

చిక్కడపల్లి, నవంబర్3 : గాంధీనగర్‌లో బూత్ కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు వివరిస్తున్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ చేసిన అభివృద్ధిని వివరిస్తూ కారు గుర్తుకే ఓటు వేయ్యాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్ శ్రీనివాస్, సత్యనారాయణ, హన్మంతు, జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.



జవహర్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు బత్తుల కిరణ్ తదితరులు



అన్నానగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు